క్లుప్తంగా

విద్యార్థులు ఏకాగ్రత పెంచుకోవాలి



ఉయ్యూరు: విద్యార్థులు ఏకాగ్రతలను పెంచుకోవాలని పలువురు వక్తలు సూచించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం కూడా కొనసాగాయి. విద్యార్థులతో పంచతంత్ర కథల పుస్తకాలను చదివించారు. సరసభారతి కార్యదర్శి మాదిరాజు శివలక్ష్మి విద్యార్థులకు సమయం విలువ, ఏకాగ్రతల అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

డిజిటల్ విద్యపై విద్యార్థులకు అవగాహన



గన్నవరంరూరల్: డిజిటల్ విద్యపై విద్యార్థులకు చిన్ననాటి నుంచి అవగాహన అవసరమని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. స్థానిక లైబ్రరీలో పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్ ఎం.శ్యాం సుందర నాగసాయి సోమవారం విద్యార్థులకు డిజిటల్ విద్యపై అవగాహన కల్పించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా ప్రభుత్వం విద్యార్థులకు వివిధ రకాల అభ్యాసాలు నేర్పిస్తున్నట్లు వివరించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు యోగా శిక్షణలో, ఆటపాటల్లో పాల్గొన్నారు. లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ర్యాపిడో మహిళా రైడర్స్ సర్వీస్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు పురుషులకు ఏ మాత్రం తక్కువ కాదని, అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. అలంకార్ సెంటర్ వద్ద ర్యాపిడో బైక్ ట్యాక్సీ సంస్థ ప్రవేశపెట్టిన మహిళా రైడర్స్ సర్వీస్‌ను మేయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ర్యాపిడో సంస్థ మహిళా రైడర్స్ సర్వీస్‌ను ఏర్పాటు చేసి మహిళా సాధికారత దిశగా అడుగు వేసిందన్నారు. పట్టణాల్లో మహిళల జీవనోపాధికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. మహిళా రైడర్స్ సర్వీస్ అందుబాటులోకి రావడం వలన మహిళల ప్రయాణానికి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. హాస్పిటల్స్, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు, ఇతర అత్యవసర పనులపై ఎక్కడికైనా వెళ్లాలంటే ర్యాపిడో మహిళా రైడర్స్ సర్వీసులు వినియోగించుకోవచ్చని చెప్పారు. మహిళా రైడర్స్‌తో రక్షణ ఉంటుందన్నారు. రైడర్స్‌కు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను సంస్థ కల్పించాలన్నారు. మగ వారికి ధీటుగా ర్యాపిడో రైడర్స్ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ర్యాపిడో సంస్థ మేనేజర్, సిబ్బంది, బైక్ రైడర్స్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరుకు చెందిన కె.శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 20వ తేదీన శ్రీనివాసరావు తన స్నేహితుడైన తిరుపతిరావుతో కలిసి విజయవాడ వస్తుండగా, పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్‌పై ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● ఆత్మీయ సత్కారం



కనక దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న డాక్టర్ దుట్టా తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏలూరు జిల్లా దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన అప్పన కనక దుర్గాప్రసాద్‌కు హనుమాన్‌జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు నివాసంలో సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులు అప్పగించటం అభినందనీయమన్నారు. శేరీనరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు, బాపులపాడు ఎంపీటీసీ సభ్యుడు కొనకళ్ల వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు మత్తి ఉదయశంకర్, తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నూలు నరసింహారావు, అన్నం సత్యనారాయణ, వేగిరెడ్డి బాలాజీ, సూర్యనారాయణ, చిన్నాల లక్ష్మీనారాయణ, నూకల బాలాజీ, కడవకొల్లు రాజేష్ పాల్గొన్నారు.

● జననేతకు ఆత్మీయ స్వాగతం

పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం మచిలీపట్నం వచ్చారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ వద్ద పలువురు ప్రజాప్రతినిధులు ఆత్మీయస్వాగతం పలికారు. పెనమలూరు, గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కొడాలి నాని, వల్లభనేని వంశీ, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ తదితరులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, మచిలీపట్నం







చురుగ్గా తాగునీటి వసతుల కల్పన

- జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1.17 కోట్లతో పనులు
- గొడవర్రులో పూర్తయిన రక్షిత మంచినీటి పథకం నిర్మాణం
- త్వరలో ప్రారంభంకానున్న పైపులైను విస్తరణ పనులు

కంకిపాడు: మండలంలోని గొడవర్రు గ్రామ ప్రజలు అందరికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి వసతుల కల్పన పనులు చురుగ్గా సాగుతున్నాయి. రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. పైపులైను విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది.

రూ.1.17 కోట్లతో అంచనాలు

గొడవర్రు గ్రామంలో ప్రస్తుతం 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం ఉంది. నాలుగు బోర్లు డైరెక్ట్ పంపింగ్ విధానం ద్వారా ఏర్పాటుచేశారు. వీటి ద్వారా ప్రస్తుతం గ్రామస్తులకు తాగునీటి సరఫరా జరుగుతోంది. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవ చూపారు. ప్రభుత్వం నుంచి జల్ జీవన్ మిషన్ నుంచి రూ.1.17 కోట్లు నిధులు మంజూరయ్యాయి. సెప్టెంబర్ 21, 2022న ట్యాంకు, పైపులైను విస్తరణ పనులకు ఎమ్మెల్యే పార్థసారథి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం నిర్మాణాన్ని పూర్తి చేశారు. ట్యాంకుకు నీటిని మళ్లించేందుకు అవసరమైన రెండు బోర్లు ఏర్పాటు చేశారు.



నిర్మాణం పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్



తాగునీటి వసతుల కల్పనకు నిర్మించిన శిలాఫలకం

పైపులైను పనులు చేపట్టాలి

రక్షిత మంచినీటి పథకం పూర్తయ్యింది. దీనికి అనుసంధానంగా గ్రామంలో అవసరమైన మేరకు నూతన పైపులైను ఏర్పాటుచేయాల్సి ఉంది. ఇందుకు అవసరమైన పైపులైన్లు, ఇతర సామగ్రి సైతం గ్రామ సచివాలయానికి తరలించారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు విడుదల కాగానే పైపులైను విస్తరణ పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సమర్థంగా తాగునీటి సరఫరా



జల్‌జీవన్ మిషన్ నిధులతో గ్రామానికి ట్యాంకు, పైపులైను మంజూరయ్యాయి. పైపులైను పనులు పూర్తయితే గ్రామానికి పూర్తి స్థాయిలో సమృద్ధిగా తాగునీరు సరఫరా అవుతుంది. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నాం.
– మేరుగు విజయ చంద్రశేఖర్, సర్పంచ్, గొడవర్రు

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ధనేకుల కాలేజీ ఒప్పందం

పెనమలూరు: ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంతో ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ఒప్పందం చేసుకుందని కాలేజీ డైరెక్టర్ కె.ఆర్.కె. రవిప్రసాద్ సోమవారం తెలిపారు. అకడమిక్ ప్రోగ్రామ్స్, పరిశోధనలు, విద్యార్థుల ప్రాజెక్టులు, సైన్స్ టెక్నాలజీపై ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంతో పరస్పర అంగీకారం కుదిరిందన్నారు. ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో విద్యా బోధన చేయటమే లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు.

24న బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా

పెనమలూరు: మండలంలోని తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో ఈ నెల 24వ తేదీన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహిస్తామని మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీలో అనధికారికంగా, ప్లాన్‌లకు విరుద్ధంగా జరిగిన నిర్మాణాలు, అనధికారిక లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతి ఇచ్చేలా 2019 సంవత్సరంలో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అనధికార కట్టడాలకు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసి పెండింగ్‌లో ఉన్న వారు ఈ నెల 24వ తేదీన పోరంకిలోని మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న గ్రంథాలయంలో జరిగే బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళాలో పాల్గొని సమస్యలు సత్వరం పరిష్కారం చేసుకోవాలని కమిషనర్ ప్రకాశరావు సూచించారు.

నేడు వలంటీర్లకు పురస్కారాలు

పెనమలూరు: మండల పరిధిలో సేవలు అందిస్తున్న గ్రామ/వార్డు వలంటీర్లకు మంగళవారం ప్రోత్సాహక పురస్కారాలు ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ సునీతాశర్మ సోమవారం తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ప్రభుత్వ ప్రకటించిందన్నారు. గోసాల గ్రామంలో వాటర్ ట్యాంకు వద్ద ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వణుకూరు, గోసాల, గంగూరు గ్రామాలకు వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద పెనమలూరు, పెదపులిపాక, చోడవరం గ్రామాల వలంటీర్లకు ఎమ్మెల్యే అవార్డులు అందచేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు హాజరుకావాలని ఎంపీడీఓ సునీతాశర్మ సూచించారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు, ఇందుపల్లి, ఆముదాలపల్లి గ్రామ సచివాలయాల్లో ఈ నెల 23న వలంటీర్లకు పురస్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆముదాలపల్లిలో 19 మంది, ఆత్కూరులో 25 మంది, ఇందుపల్లిలో 17 మందికి సేవా మిత్ర అవార్డుల ప్రదానం చేస్తామని తెలిపారు. ఇందుపల్లిలో ఒకరికి సేవా రత్న అవార్డు అందజేయనున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్థాయి అధికారులు ఈ కార్యక్రజుమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జూనియర్ కళాశాలకు ఏడుగురు అధ్యాపకుల కేటాయింపు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల బాలికల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో ప్రభుత్వం ఏడుగురు అధ్యాపకులను కేటాయించింది. నూతన అధ్యాపకులు సోమవారం హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన నిమిత్తం కళాశాలకు కొత్తగా ఏడుగురు పీజీటీలను కేటాయించడం సంతోషకరమన్నారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ప్రవేశాల నిమిత్తం గడప గడపకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ఇంటర్మీడియెట్ కోర్సులకు విద్యార్థిని నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న హెచ్‌ఎం భవాని

పాడి పరిశ్రమపై రైతుల మొగ్గు

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వ్యవసాయంలో ఒడుదొడుకులు ఉండటంతో ప్రస్తుతం రైతులు తిరిగి పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని కాకాని వెంకటరత్నం పాల ఉత్పత్తిదారుల భవనంలో హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల సహకార సంఘాల అధ్యక్షులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా తొలుత చలసాని ఆంజనేయులును పాల సొసైటీ అధ్యక్షులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి సొసైటీ అధ్యక్షులకు ఆయన అందించారు. అనంతరం చలసాని మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టే నాటికీ లీటరు పాల సేకరణ ధర రూ.56 ఉండగా, నాలుగేళ్ల వ్యవధిలో ఆ ధరను రూ.80కు పెంచామని చెప్పారు. దీనికి తోడు లీటరు పాలకు రూ.5 చొప్పున పాడి రైతులకు బోనస్ అందిస్తున్నామని వివరించారు. నిరంతరం పాడి రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నామని, కేవలం పాల ధర చెల్లించటమే కాకుండా రాయితీలపై పశువుల దాణా, పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కృష్ణా మిల్క్ యూనియన్ సగటున రోజుకు 1.80 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోందని చలసాని తెలిపారు. వేసవి ప్రారంభమైన తర్వాత గణనీయంగా సగటున రోజుకు 50 వేల లీటర్ల పాలు అధికంగా సేకరిస్తున్నామని వివరించారు. హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



చైర్మన్ చలసాని ఆంజనేయులును సత్కరిస్తున్న పాల సహకార సొసైటీల అధ్యక్షులు

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

కంకిపాడు: చదువుతో పాటు వ్యాయామం కూడా ముఖ్యమేనని విశ్రాంత ఎంఈఓ వంగల గోవిందరావు అన్నారు. కంకిపాడు, తెన్నేరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వేసవి శిబిరాల్లో భాగంగా సోమవారం పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో విశ్రాంత ఎంఈఓ వంగల గోవిందరావు వ్యాయామం చేయించారు. వ్యాయామంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రముఖుల జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వై.మల్లిక స్పోకెన్ ఇంగ్లిష్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.



వ్యాయామంపై శిక్షణ ఇస్తున్న విశ్రాంత ఎంఈఓ వంగల గోవిందరావు

కానూరులో జీవ వైవిధ్య దినోత్సవ ర్యాలీ

పెనమలూరు: మండలంలోని కానూరులో ఇంజినీరింగ్ విద్యార్థులు జీవ వైవిధ్య దినోత్సవాన్ని సోమవారం జరిపారు. కానూరు వీఆర్‌సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. భూమి పై జీవల మధ్య భేదాన్ని జీవవైవిధ్యం అంటామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పేర్కొన్నారు. జీవన శైలిలో పర్యావరణం కాలుష్యం బారినపడితే జీవ వైవిధ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయంలో రసాయన ఎరువులు వాడటం వల్ల పక్షి జాతులకు ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. జంతువులు, మొక్కలను పరిరక్షించటానికి ప్రతి ఒక్కరు కృషి చేయలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు.



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉద్యోగానికి వచ్చి..

విగతజీవిగా మారి..



విహారంలో విషాదం నింపిన కారు ప్రమాదం



విలపిస్తున్న భానురేఖ బంధువులు

కుటుంబ సభ్యులకు భానురేఖ మృతదేహం అప్పగింత

బనశంకరి: బెంగళూరు నగరంలో కేఆర్ సర్కిల్ అండర్‌పాస్‌లో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కారు మునిగిపోవడంతో మృతి చెందిన ఐటీ ఇంజినీరు బత్తుల భానురేఖ మృతదేహానికి విక్టోరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపి సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంబులెన్స్ ద్వారా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి తీసుకెళ్లారు. ఆమె బెంగళూరులో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తోంది. ఉన్నతస్థాయికి చేరాల్సిన తమ బిడ్డ పాతికేళ్లు నిండకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిందని బంధువులు విలపించారు.

కార్పొరేషన్ అధికారులపై కేసు

అండర్‌పాస్ ఘటనపై హలసూరుగేట్ పోలీసులు బెంగళూరు కార్పొరేషన్ అధికారులపై కేసు నమోదు చేశారు. యువతి సోదరుడు సందీప్ హలసూరుగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అండర్‌పాస్‌లో నీరు నిలిచిపో యిందని, నీరు బయటికి వెళ్లేలా చర్యలు తీసుకోలేదని ఫిర్యా దులో పేర్కొన్నారు. దీంతో స్థానిక బీబీఎంపీ అధికారులపై ఐపీసీ సెక్షన్ 304 ఏ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గతంలో కూడా ఇటు వంటి ప్రమాదాల సమయంలో స్థానిక పాలికె అధికారులపై కేసులు నమోదు చేశారు. అవి ఏమయ్యాయో ఇప్పటికీ తెలియదు.

కారు డ్రైవరు అరెస్ట్

భానురేఖ మృతికేసులో క్యాబ్ డ్రైవరు హరీశ్‌ను హలసూరుగేట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. నిర్లక్ష్యంగా కారు నడిపి మృతికి కారణమయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. భానురేఖ ఎలక్ట్రానిక్‌సిటీలో నివసి స్తుండగా బెంగళూరునగరం చూపించాలని కుటుంబసభ్యులతో కలిసి క్యాబ్‌బుక్ చేసుకుని కారులో బయలుదేరి ప్రమాదంలో చిక్కుకున్నారు. ఆమె మృతిపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ నగర పాలికె పనితీరుపై విమర్శలు కురిపించారు.

పాత వస్తువుల రీసైక్లింగ్‌తో ప్రయోజనం



పాత వస్తువుల రీసైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న చైర్మన్ నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: పాత వస్తువులను పార వేయకుండా రీసైక్లింగ్ చేసి తిరిగి వినియోగించుకోవచ్చని ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని నాని సూచించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పాత వస్తువుల రీసైక్లింగ్ విధానంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. పాత దుస్తులు, ఇతర వస్తువులతో రీసైక్లింగ్ చేసి ఉపయోగంలోకి తెచ్చిన వాటిని ప్రదర్శించి పలువురికి అందించారు. చైర్మన్ నాని మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు పాత వస్తువులను పునర్వినియోగంలోకి తెచ్చేందుకు ముందుకు రావాలన్నారు. పనికిరాని దుస్తులను రీసైక్లింగ్ చేసి అనేక ఉపయోగకర వస్తువులను తయారుచేయొచ్చని సూచించారు. మహిళలు రీసైక్లింగ్‌లో ప్రధాన పాత్ర పోషించటం అభినందనీయమన్నారు. మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వర రావు రీసైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. మునిసిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు.

శాప్ సభ్యుడిగా కావాటి దామోదర్ నియామకం

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) సభ్యుడిగా మాజీ కార్పొరేటర్ కావాటి దామోదర్ నియమితులయ్యారు. నగరంలోని శాప్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శాప్ ఎండీ కె.హర్షవర్ధన్ దామోదర్‌కు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు రుణపడి ఉంటానన్నారు.

శ్లాబు పనులకు పూజా కార్యక్రమం

గన్నవరంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.ఎలిజబెత్ రాణి, సూరంపల్లి సర్పంచ్ పులపాక బాబూరావు అన్నారు. సోమవారం నాడు-నేడు పథకం ద్వారా గ్రామంలో నిర్మాణం చేస్తున్న హైస్కూల్ భవనం శ్లాబు పనులకు వారు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సహకార బ్యాంకు చైర్ పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, హెచ్‌ఎం గోవిందరాజులు పాల్గొన్నారు.